www.prajasakti.com

ప్రజాశక్తి

శుక్రవారం 10 అక్టోబర్ 2025



కాణిపాకం దేవస్థానంకు విరాళాలు



విరాళం అందిస్తున్న దాతలు

ప్రజాశక్తి- ఐరాల: కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామివారి దేవస్థానం నిత్య అన్నదానం ట్రస్టుకు రూ.80వేలు, గో సంరక్షణ ట్రస్ట్ కి రూ.లక్ష విరాళంగా విజయవాడకు చెందిన దాత తెలుగు ఆర్ట్ యాత్ శ్రీసాయి అందజేశారు. వీరికి ఆలయ సూపరింటెండెంట్ దర్శన ఏర్పాట్లు చేసి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు. టెంపుల్ ఇన్స్పెక్టర్ బాలాజీ నాయుడు, చిట్టిబాబు, తదితరులు ఉన్నారు.

ఎలక్ట్రికల్ బైక్ విరాళం

శ్రీ వరసిద్ధి వినాయక స్వామి వారి దేవస్థానంకు రూ.50వేలు విలువ చేసే ఎలక్ట్రికల్ టూ వీలర్ బైక్ ఒరగొండకు చెందిన శ్రీవెంకటేశ్వర ఐవి బైక్స్ ప్రకాష్ గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఈవో పెంచల కిషోర్‌కి కార్యాలయం వద్ద బైక్‌ను అందజేశారు. ఆలయ ఏఈఓ రవీంద్రబాబు, సూపరింటెండెంట్లు కోదండపాణి, వాసు, తదితరులు పాల్గొన్నారు.



బైక్‌ను ఈవోకు అందజేస్తున్న దాత

క్వారీ రాయల్టీ చెల్లింపుల్లో అక్రమాలు

- ప్రభుత్వ ఆదాయానికి గండి
- ముగిసిన టెండర్లు..
- యథేచ్ఛగా పక్క రాష్ట్రాలకు

తరలిపోతున్న ఖనిజ సంపద

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్

గత వైసిపి ప్రభుత్వ పాలనలో క్వారీల రాయల్టీ వసూళ్లు నాటి అధికార పార్టీకి చెందిన ఓ కీలమైన నాయకుడి కనుసన్నల్లో నడిచేది. అక్టోబర్ ఒకటో తేదీకి ఏజెన్సీ టెండర్ గడువు ముగిసింది. ప్రస్తుత కూటమి ప్రభుత్వం కొత్త టెండర్లను ఆహ్వానించింది. క్వారీ రాయల్టీ వసూలు చేసే టెండర్ దక్కించుకొనేందుకు అధికార పార్టీలో ముఖ్యమైన నాయకులు పోటీ పడుతున్నారు. గతంలో గ్రానైట్స్ యాజమానుల ఆసోషియేషన్ ముఖ్యనాయకుడిగా వ్యవహరించి ప్రస్తుతం ఎంఎల్‌ఏగా కొనసాగుతున్న అధికార పార్టీకి చెందిన వ్యక్తి రాయల్టీ టెండర్‌ను దక్కించుకొనేందుకు విశ్వప్రయత్నం చేస్తున్నారు. చిత్తూరు పరిసర ప్రాంతాల్లో క్వారీలు, గ్రానైట్ ఫ్యాక్టరీలు ఉండటంతో ఎలాగైనా రాయల్టీ టెండర్ దక్కించుకుంటే ఆర్థికంగా ఎదిగేందుకు తోడ్పడుతుంది. అలాగే పార్టీ అధికారంలో ఉండటం... పైగా ఎంఎల్‌ఏ కావడంతో కలిసోస్తోందని టెండర్ కోసం తీవ్ర ప్రయత్నం చేస్తున్నట్లు సమాచారం.



పాత టెండర్ రద్దు, కొత్త టెండర్ ఖరారు కావడానికి కొంత సమయం పట్టేలా ఉండటంతో క్వారీల నుండి గ్రానైట్ బండరాళ్ళను అక్రమంగా ఫ్యాక్టరీలకు దొంగ బిల్లుతో అధికార పార్టీకి చెందిన కొందరు తరలిస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండికొట్టి సొమ్ము చేసుకుంటున్నారనే ఆరోపణలున్నాయి. విలువైన క్వారీ రాళ్ళున్న బంగారుపాళ్యం, చిత్తూరు రూరల్, జీడి నెల్లూరు, యాదమరి ప్రాంతాల్లో దొంగ బిల్లులు సృష్టించి క్వారీల నుండీ రాళ్ళను తరలిస్తున్నారు. ఈ దందా బంగారుపాళ్యం, యాదమరి మండలంలో విచ్చలవిడిగా అధికారపార్టీ అండదండలతో సాగిపోతోంది. మామూళ్ళు ముట్టుతుండటంతో మైనింగ్‌శాఖ అధికారులు చూసిచూడన్నట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలున్నాయి. మరోవైపు జీడి నెల్లూరు నియోజకవర్గంలో క్వారీ, గ్రావెల్ తవ్వకాలను జిల్లాస్థాయి అధికారులు, మైనింగ్ అధికారులు కట్టడి చేయలేకపోవడంతో జిల్లాలోని విలువైన ఖనిజ సంపద యథేచ్ఛగా పక్క రాష్ట్రాలకు తరలిపోతోంది. ఇక్కడి ఎంఎల్‌ఏ ప్రధాన అనుచరుడు కీలక సూత్రధారిగా మైనింగ్ అక్రమాలకు పాల్పడుతున్నాడంటూ.. స్థానిక అధికార పార్టీ నేతలే జిల్లా కలెక్టర్, ప్రభుత్వానికి ఫిర్యాదులు చేసినా పట్టించుకొని పరిస్థితి.

అడ్డూ.. అదుపు ఏదీ..?

క్వారీ నుండీ గ్రానైట్ ప్యాక్టరీకి డ్రసింగ్ చేసిన గ్రానైట్ రాయి తరలించాలంటే మైనింగ్ శాఖకు రాయల్టీ కట్టి తరలించాల్సి ఉంటుంది.



అయితే కొందరు అధికార పార్టీ నేతలు దొంగ బిల్లులు సృష్టించడంతో పాటు మైనింగ్ అధికారులను ప్రలోభాలకు గురిచేస్తూ అక్రమ దందా నడుతున్నారు. జిల్లాలో సాగుతున్న ఈ వ్యవహారం రాష్ట్ర పార్టీ దృష్టి వెళ్లగా రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జిల్లాలో ఆరోపణలు ఎదుర్కొంటున్న నేతలను పిలిచి హెచ్చరించిన్నట్లు సమాచారం. అక్రమ క్వారీలు, మైనింగ్ తరలింపును అడ్డుకొని ప్రభుత్వ ఆదాయాన్ని కాపాడాల్సిన బాధ్యత జిల్లా మైనింగ్‌శాఖ అధికారులపై ఉంది.

నేటి నుంచి బోధనేతర పనులు బహిష్కరణ

కలెక్టర్, డీఆర్‌ఓ, డీఈఓకు యుటిఎఫ్ వినతి

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: మితిమీరిన బోధనేతర కార్యక్రమాల వలన బోధనా సమయం హరించుకుపోతున్నదని, ఉపాధ్యాయులకు కూడా బోధనపై ఆసక్తి తగ్గిపోయే విధంగా బోధనేతర కార్యక్రమాలు పెరిగిపోయాయని, పలు ధఫాలు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసినా, ఏమాత్రం పట్టించుకోనందున ఈనెల 7వ తేదీ విజయవాడ ధర్నా చౌక్ వద్ద ఫ్యాప్టో ఆధ్వర్యంలో జరిగిన 'పోరుబాట' కార్యక్రమంలో ఈనెల 10వ తేదీ నుంచి బోధనేతర పనులను బహిష్కరించాలని ఫ్యాప్టో రాష్ట్ర కమిటీ నిర్ణయం తీసుకున్నట్లు ఫ్యాప్టో చైర్మన్ ఎస్. మణి గండన్, సెక్రటరీ జనరల్ జి. మునీర్ అహ్మద్ తెలిపారు. కేవలం బోధనకే పరిమితమై బోధనలో మరింత నాణ్యమైన విద్యను విద్యార్థులకు అందించాలని, ఉపాధ్యాయుల హాజరు, విద్యార్థుల హాజరు మధ్యాహ్న భోజన పథకకు సంబంధించిన పనులు మాత్రమే ఉపాధ్యాయులు చేపడుతారని, మూల్యాంకనానికి సంబంధించిన పరీక్షల నిర్వహణ తప్ప, ఏ ఇతర బోధనేతర పనులను గాని అనవసరమైన గూగుల్ షీట్స్ నింపడం గాని, విద్యాశక్తి, జీనస్ట్ 2.0 లాంటి సీజనల్ ప్రచార కార్యక్రమాలను గాని చేపట్టబోమని తెలిపారు. ఈ సందర్భంగా నేటి నుంచి బోధనేతర పనులను బహిష్కరిస్తున్నామంటూ జిల్లా కలెక్టర్, డీఆర్‌వో, డీఈవోలకు వినతిపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఫ్యాప్టో నాయకులు జి. చంగల్ మండి, జీవి రమణ, ఎస్‌ఆర్.మదన్ మోహన్ రెడ్డి, కిరణ్ కుమార్, జగదీష్, ప్రభాకర్, సుధాకర్ రెడ్డి, ఎస్బీ బాషా, సమీర్, ముక్త రూపావత్, చంద్రన్, చిరంజీవి, సురేష్ బాబు, సుబ్రహ్మణ్యం, విజయ్ కుమార్, గణపతి పాల్గొన్నారు.



చిత్తూరులో డీఆర్‌వోకి వినతిపత్రం ఇస్తున్న ఫ్యాప్టో నాయకులు

వేయడం, పరీక్షల మార్కులు అప్లోడ్ చేయడం, మధ్యాహ్న భోజన వివరాలు అప్లోడ్ చేయడం తప్ప వేరే బోధ నేతర కార్యక్రమాలు గూగుల్ పత్రాలు అప్లోడ్ చేయడం, విద్యాశక్తి కార్యక్రమం, జీనస్ట్ అవగాహన కార్యక్రమాలు బహిష్కరిస్తున్నామని తెలిపారు. ఫ్యాప్టో చిత్తూరు జిల్లా సెక్రటరీ జనరల్ మునీర్ అహ్మద్, డిప్యూటీ సెక్రటరీ జనరల్ మదన్ మోహన్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు మధుసూదన్, మండల నాయకులు సుబ్రహ్మణ్యం శెట్టి, ప్రభాకర్ రెడ్డి, పంటపల్లి సురేష్, సురేష్, మణిరెడ్డి, ఓబుల్ రెడ్డి, రహ్మాన్ బేగం, జ్యోతి, గఫూర్ పాల్గొన్నారు.

కార్వేటినగరం: మండల ఫ్యాప్టో ఆధ్వర్యంలో బోధనేతర పనులు, ఉపాధ్యాయులపై అనవసరంగా రుద్దుతున్న యాప్‌లన్నిటిని రేపటి నుండి ఉపాధ్యాయులు ఎవరు కూడా సహకరించరని, కేవలం బోధనకు మాత్రమే సమయం కేటాయించాలని రాష్ట్ర ఫ్యాప్టో నిర్ణయం మేరకు గురువారం కార్వేటి నగరం మండల వనరుల కేంద్రంలో ఉపాధ్యాయ సమైక్య ఆధ్వర్యంలో సెల్ డౌన్, పెన్ డౌన్ చేపడుతామని ఫ్యాప్టో నాయకులు ఎంఈవో ఆఫీస్‌లోని సిబ్బందికి వినతి పత్రం అందజేయడం జరిగింది.

యాదమరి ఎంఈవోకి ఫ్యాప్టో వినతి

యాదమరి: నేటి నుంచి బోధనేతర పనులు, ఇతర కార్యక్రమాలు బహిష్కరిస్తున్నామని మండల ఫ్యాప్టో సంఘ నాయకులు మండల విద్యాశాఖ అధికారి రుక్మిణి, ప్రసాద్ వినతి పత్రం అందించారు. గురువారం పాఠశాలల్లో విద్యార్థులకు హాజరు



యాదమరిలో ఎంఈవోకి వినతిపత్రం ఇస్తున్న ఫ్యాప్టో నాయకులు

ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీగా


'పీపుల్స్ ఐఏఎస్ ఆఫీసర్' శివశంకర్

ప్రజాశక్తి- తిరుపతి సిటీ: పీపుల్స్ ఐఏఎస్ ఆఫీసర్‌గా పేరు గడించిన శివశంకర్ లోతేటిను ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. శివశంకర్ గతంలో పని చేసిన ప్రతీ చోట పాడేరు సబ్ కలెక్టర్ నుండి కడప కలెక్టర్ వరకూ ప్రజల ఐఏఎస్ అధికారిగా ప్రత్యేక గుర్తింపు పొందారు. సాధారణంగా అధికారులు ప్రభుత్వం చెప్పిన పనులు, లక్ష్యాలకే పరిమితం అవుతారు. వాటితో పాటు, ప్రత్యేకమైన చొరవ తీసుకుని అటు ప్రజలకు, ఇటు ప్రభుత్వానికి ఉపయోగపడేలా పని చేసిన ప్రతీ చోటా అనేక ప్రజాహిత కార్యక్రమాలు చేపట్టారు. ముఖ్యంగా ప్రతి సోమవారం జరిగే గ్రీవెన్స్ డేలో ప్రజలను వివిఐపీలుగా చూస్తారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ 'పీపుల్స్ ఐఏఎస్ ఆఫీసర్'గా పేరు సంపాదించుకున్నారు.



శివశంకర్ 2013 బ్యాచ్‌కు చెందిన అధికారి. విజయనగరం జిల్లా ధర్మవరం గ్రామవాసి. తండ్రి సన్యాసప్పుడు విశాఖపట్నంలోని ఐటిడిఎ పాడేరులో ఆరోగ్యశాఖలో ఎమ్పీహెచ్‌ఏగా పని చేసేవారు. పదవ తరగతి వరకు జిల్లా పరిషత్ హైస్కూలు, ధర్మవరంలో చదువుకున్నారు. ఇంజనీరింగ్ నీట్ సూరత్కాల్‌లో పూర్తి చేసి అక్టోగా పని చేస్తూ ఐఏఎస్ సాధించారు. 2016-17లో పాడేరులో సబ్ కలెక్టర్ అండ్ పీఓ ఐటీడీఏగా పని చేశారు. శుక్రవారం ఓ యువకుడు వచ్చి మా ఊరులో మంచి జలపాతం ఉంది, టూరిజం అభివృద్ధి కి అవకాశం ఉంది ఓ సారి చూసి వెళ్లండి అని అడిగందే తడవు వెళ్లి చూసి కొల్లాపుట్టు జల తరంగిణి అనే పేరుతో అభివృద్ధి చేసి రిసార్టులు ఏర్పాటయ్యేలా చేసి స్థానిక గిరిజన యువతకు ఉపాధి కల్పించారు. ఇంకా బొర్రా గుహల సంక్షిప్త చరిత్రను తెలుగులో స్వయంగా రాసి పర్యాటకులకు అందుబాటులోకి తీసుకొచ్చారు. అరకు గిరిజన మ్యూజియం, పద్మాపురం గార్డెన్స్ ఆధునీకరించారు. కటిక జలపాత అభివృద్ధి నిర్వహణ స్థానిక గిరిజన యువత చేతిలో పెట్టారు .ఐటీడీఏ సందర్శకుల కోసం ఎస్ఆర్ శంకరన్ సంక్షేమ కాంటీన్ ఏర్పాటు చేశారు. అప్పటి ప్రభుత్వం తొలిసారిగా మోదకొండమ్మ జాతర ను రాష్ట్ర పండుగగా ప్రకటించింది ఈ సమయంలోనే చాపరాయి జలపాతం కాదని, దానిని మార్చి చాపరాయి జలవిహారి నామకరణం చేసి అభివృద్ధి చేశారు.

2017-19లో సీతంపేట ఐటీడీఏలో పని చేసి అక్కడ చెరగని ముద్ర వేసారు. అక్కడి గిరిజనులకు ఆయన ఓ ఆశాజ్యోతి. వారి కోసం ఎన్నో మంచి కార్యక్రమాలు చేశారు. ముఖ్యంగా వారికి అనేక స్వయం ఉపాధి అవకాశాలు కల్పించారు. గిరిజన యువత కాంట్రాక్టర్లుగా ఎదిగేలా చేశారు. స్థానికంగా గిరిజన యువతతో పౌల్ట్రీలు పెట్టించి హబ్ స్పోక్ మోడల్‌లో స్కూల్స్‌లో చికెన్ అందేలా చేశారు. ఓ సంవత్సరం తర్వాత, ఇక్కడ మెనూ గురించి తెలుసుకున్న ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా మెనూలో చికెన్‌ను చేర్చింది. అలాగే అక్కడి హాస్పిటల్స్ రూపురేఖలు మార్చి రాష్ట్రంలోనే అత్యుత్తమ గిరిజన హాస్పిటల్స్‌గా తీర్చిదిద్దారు. సిహెచ్ సి సీతంపేట అయితే ఓ ప్రత్యేకం . గిరిజన ప్రాంతంలోనే తొలి ఎయిర్ కండిషన్డ్ హాస్పిటల్‌గా కార్పోరేట్ తరహాలో అభివృద్ధి చేశారు. 2019 ఫిబ్రవరి వరకూ ఆ జిల్లా ఎలా అభివృద్ధి చెందుతూ వచ్చిందో మినియేచర్ మోడల్స్‌తో శివశంకర్ ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్ శ్రీకాకుళం జిల్లా ప్రజలు ఇప్పటికీ మర్చిపోలేరు. 2020-22లో కృష్ణాజిల్లా జాయింట్ కలెక్టర్‌గా 116 సచివాలయాలు ఐఎస్ఓ 9001 సర్టిఫైడ్ కార్యాలయాలుగా తీర్చిదిద్దారు. 2022-24లో పల్నాడు జిల్లా ప్రథమ కలెక్టర్‌గా పనిచేసిన శివశంకర్ నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పని చేశారు.



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ఐఏఎస్ అధికారి శివశంకర్

రెవెన్యూ సమస్యలకైతే స్వయంగా కలెక్టరే జడ్జిలా వ్యవహరించి ఇరు పక్షాల రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించి న్యాయం చేసేవారు.

'పల్నాడు వర్మీ- పొలానికి బలిమి' అనే బ్రాండ్‌తో ప్రతి పంచాయతీలోనూ ఎస్‌డబ్ల్యుపిసిలను బలోపేతం చేసి వర్మీ కంపోస్ట్‌ను రైతులకు, వినియోగదారులకు దగ్గర చేశారు. 2024లో కడప కలెక్టర్‌గా చేసింది మూడు నెలలైనా అక్కడా చెరగని ముద్ర వేశారు. రెవెన్యూ సమస్యలను తనదైన శైలిలో పరిష్కరించడానికి ప్రయత్నించారు. ఇంకా క్రీస్తు శకం 575 నాటి తొలి తెలుగు శాసనం ఎర్రగుంట్ల మండలంలోని కలమళ్ళ గ్రామంలో నిరాదరణగా ఉంటే దానిని గుర్తించి ఆగస్టు 29న మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు చేతుల మీదగా శాసనానికి గౌరవ ప్రతిష్ఠ చేశారు. గండికోట అభివృద్ధిలో స్థానిక భాగస్వామ్యం ఉండాలనే లక్ష్యంతో గండికోట టూరిజం డెవలప్మెంట్ కమిటీ ఏర్పాటు చేశారు. గ్రామోదయం ద్వారా గ్రామీణ ప్రాంతాల పర్యటన ముమ్మరం చేశారు. సీపీ బ్రౌన్ లైబ్రరీ ఆధునీకరణ పనులు వేగవంతం చేశారు

ఇండియాపై అమెరికా పెత్తనాన్ని వ్యతిరేకించండి

జీఎస్టీ పేరుతో దోచుకున్న మొత్తాన్ని తిరిగి ఇవ్వాలి

సిపిఎం జిల్లా కన్వీనర్ వాడ గంగరాజు

ప్రజాశక్తి- పలమనేరు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలు, భారతదేశంపై అమెరికా పెత్తనాన్ని వ్యతిరేకించాలని సిపిఎం క్షేత్రస్థాయి నుండి ప్రజలను చైతన్యవంతులు చేయడానికి విస్తృత కార్యక్రమాలు చేస్తున్నదని ఈ కార్యక్రమాలను జయప్రదం చేయాలని గురువారం పలమనేరు సిపిఎం కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో సిపిఎం జిల్లా కన్వీనర్ వాడ గంగరాజు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ భారతదేశంలో భారీస్థాయిలో సుంకాలు విధించి ఇబ్బందులు గురిచేయడం దారుణమని ప్రతి ఒక్కరు వ్యతిరేకించాలని అన్నారు. దేశ ప్రధాని ట్రంప్ నాకు చాలా మంచి మిత్రుడు అని విదేశాలకు వెళ్లి గొప్పగా చెప్పుకుంటున్నాడని, అలాంటి ట్రంప్ మన దేశంపై పెత్తనం చేస్తుంటే చూస్తూ ఉండడం ఏమిటి అని ప్రశ్నించారు. కేంద్రంలోని మతోన్మాద బిజెపి ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై ప్రజలలో వ్యతిరేకత పెరుగుతున్న సందర్భంలో ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నదని విమర్శించారు. బీహార్లో లక్షలాది హోటల్ తొలగించి మళ్లీ అధికారంలోకి రావడానికి ప్రయత్నం చేస్తున్నదని ఓట్ల చోరీతో వ్యతిరేకత వస్తుంటే వాటి నుంచి బయటపడడానికి ప్రజలను మభ్యపెట్టడానికి జీఎస్టీ తగ్గించి గొప్పలు చెప్పుకుంటుందని, మరి ఇన్ని సంవత్సరాలుగా జీఎస్టీ పేరుతో పేదల నుంచి దోచుకున్న డబ్బులు మొత్తాన్ని తిరిగి చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు చేస్తూ కార్పొరేట్ శక్తులకు ఊతంఇచ్చే విధంగా వ్యవహరించడం దారుణమన్నారు. మోడీ తీసుకున్న నిర్ణయాలను రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం తూచా తప్పకుండా అమలు చేయడానికి వేగంగా నిర్ణయాలు చేస్తున్నదని, మొన జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో 13 గంటలు పని విధానాన్ని తీసుకువచ్చి రాత్రుల్లో కూడా మహిళలను డ్యూటీ చేసే విధంగా నిర్ణయం చేయడం దుర్మార్గమన్నారు. చిత్తూరు జిల్లాలో పేదల భూ సమస్యలు రోజురోజుకీ పెరుగుతున్నాయని ఆ సమస్యల పరిష్కారం కోసం సిపిఎం పోరాటాలకు సిద్ధమవుతున్నదని తెలిపారు. ఈ సమస్యలను క్షేత్రస్థాయి నుంచి ప్రజలను చైతన్యవంతం చేయడానికి సిపిఎం సభ్యులంతా ప్రజల్లో ఉండి పనిచేయాలని పిలుపునిచ్చారు. సిపిఎం నాయకులు కుమారస్వామి రెడ్డి, జిల్లా నాయకులు గిరిధర్ గుప్తా, ప్రతాప్, శ్రీరాములు, ధనలక్ష్మి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కన్వీనర్ గంగరాజు

ఎమ్మెల్సీని కలిసిన ద్రవిడ వర్సిటీ ఉద్యోగులు

ప్రజాశక్తి- కుప్పం: కుప్పం ద్రావిడ విశ్వవిద్యాలయం నాన్ టీచింగ్ ఉద్యోగులు గురువారం ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్‌ను కలిశారు. ద్రవిడ వర్సిటీలో నాన్ టీచింగ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ఈ సందర్భంగా వారు ఎమ్మెల్సీని కోరారు. ప్రస్తుతం ఆరు నెలల జీతాలు వచ్చాయని స్ట్రైక్ చేసిన కాలానికి సంబంధించి నాలుగు నెలల జీతాలు రావాల్సి ఉందని ఉద్యోగులు ఎమ్మెల్సీ దృష్టికి తీసుకువచ్చారు. యూనివర్సిటీలో డబ్బులు ఉన్న జీతాలు ఇవ్వలేదని, పెండింగ్ జీతాలు ఇప్పించాలని విజ్ఞప్తి చేశారు. వర్సిటీ స్థాపించినప్పటి నుండి పనిచేస్తున్న నేటికి ఉద్యోగ భద్రత లేదని అదేవిధంగా నెలనెలా సక్రమంగా జీతాలు రావడం లేదంటూ పలువురు ఉద్యోగులు ఎమ్మెల్సీ ఎదుట వాపోయారు. ద్రవిడ వర్సిటీలో నెలకొన్న సమస్యలను సీఎం చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ని దృకి తీసుకెళ్లి పరిష్కరిస్తామని ఎమ్మెల్సీ భరోసా ఇచ్చారు.



డాక్టర్ సురేష్ బాబును సత్కరించిన ఉద్యోగులు

పిఎంకె ఉడా చైర్మన్‌గా ఇటీవల ప్రమాణ స్వీకారం చేసిన టిడిపి నేత డాక్టర్ సురేష్ బాబును వర్సిటీ నాన్ టీచింగ్ ఉద్యోగులు ఘనంగా సత్కరించారు. ద్రవిడ వర్సిటీ నాన్ టీచింగ్ ఉద్యోగులకు అన్ని విధాలుగా కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని, వర్సిటీ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ అంకితభావంతో పనిచేయాలని ఆయన పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో గణేష్ అధ్యక్షులు, జ్ఞానశేఖర్ కార్యదర్శి, శ్రీనివాస్, నాగరాజ్, విజయమ్మ, చలం మహేష్, అవుట్సోర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

పాలీహౌస్ వ్యవసాయంపై దృష్టి పెట్టండి: కలెక్టర్

ప్రజాశక్తి- కుప్పం: పాలీహౌస్ వ్యవసాయంపై రైతులు దృష్టి పెట్టాలని ఈ పద్ధతి ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని చిత్తూరు కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. కుప్పంలో ఉద్యానవన శాఖ సీడ్ ఏపీ ఆధ్వర్యంలో పాలీహౌస్ సాగుపై రైతులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమాన్ని కలెక్టర్ సుమిత్ కుమార్ పరిశీలించి అధికారులు, రైతులతో సమావేశమయ్యారు. పాలీహౌస్ సాగు ఉష్ణోగ్రత, తేమ, కాంతి వంటి కారకాలను నియంత్రించడం ద్వారా పంటల నాణ్యత, దిగుబడి పెంచుకోవచ్చు అన్నారు. బయటి వాతావరణ పరిస్థితులతో సంబంధం లేకుండా, అన్ని కాలాల్లో పంటలు పండించవచ్చని. నియంత్రిత వాతావరణం వల్ల పంటలకు తెగుళు,, వ్యాధుల బెడద తగ్గుతుందన్నారు. అదేవిధంగా డ్రిప్ ఇరిగేషన్ వంటి పద్ధతులతో నీటి వినియోగాన్ని ఆదా చేసుకోవచ్చని, పాలీహౌస్ నిర్మాణానికి ప్రభుత్వం సబ్సిడీలు అందజేస్తుందని సూచించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ శ్రీకాంత్, ఆర్టీసీ వైస్ చైర్మన్ మునిరత్నం, కడపిడి వికాస్ మర్మత్, ఏఎంసీ చైర్మన్ జిఎం రాజు, ఏడి హెచ్ పల్లవి, హెచ్ఓలు డీంపు ప్రియ, వినోద్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

అలా వచ్చారు.. ఇలా వెళ్లారు..!


నిధుల వినియోగంలో వివక్షపై సర్పంచుల ఆగ్రహం

వాయిదా పడ్డ మండల సర్వసభ్య సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్‌పి చైర్మన్ శ్రీనివాసులు

ప్రజాశక్తి- వి కోట: మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో సాధారణ మండల సర్వసభ్య సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిపి యువరాజ్ మాట్లాడుతూ మండలంలో గతానికి భిన్నంగా గ్రామపంచాయతీలలో నిధులు ఉన్నా కొంతమంది కూటమి నాయకుల ఆదేశాలతో ప్రస్తుతం వైసిపి సర్పంచులు తమ గ్రామాలలో చేసిన అభివృద్ధి పనులకు బిల్లులు చెల్లించని పంచాయతీ సెక్రటరీల తీరుపై మండిపడ్డారు. పంచాయతీలలో ప్రజాప్రతినిధిగా ఎన్నికోబడిన సర్పంచ్లు చెప్పిన పనులు పక్కనపెట్టి కూటమి నాయకులు చెప్పిన విధంగా నడుచుకుంటున్న పంచాయతీ సెక్రటరీలు ప్రజలకు ఏం న్యాయం చేస్తారని ప్రశ్నించారు. పంచాయతీ కార్యదర్శులందరూ తప్పనిసరిగా సచివాలయంలో అందుబాటులో ఉండాలన్న నిబంధనను పాటించటం లేదన్నారు. బోయచిన్నాగనపల్లి పంచాయతీ కడతనాయనపల్లి గ్రామంలో దశాబ్దాల నుండి రైతులు తమ పంట పొలాలకు వెళ్తున్న దారిని అధికార పార్టీ నేతల ఒత్తిడితో అడ్డుపడి దారిని మూసివేశారన్నారు. నెలల తరబడి సమస్య పరిష్కారానికి తిరుగుతున్నా రెవెన్యూ సిబ్బంది సమస్యను పరిష్కరించకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారని సమాధానం చెప్పాల్సిన తహశీల్దార్ సెలవుపై వెళ్లడంతో ఎవరిని అడగాలని ప్రశ్నించారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు గ్రామాల్లో డ్రైన్లు బ్లాక్ అయ్యి మురుగునీరు రోడ్లపై ప్రవహిస్తున్న పట్టించుకోవడం లేదని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. తన సమస్యలు పరిష్కారం అయ్యేంతవరకు సమావేశాన్ని బహిష్కరించారు. చిత్తూరు జిల్లా పరిషత్ చైర్మన్ శ్రీనివాసులు కలుగజేసుకొని 72 గంటలు సమయం ఇస్తున్నామని అంతలోపు గ్రామపంచాయతీ కార్యదర్శులు సమస్యను సావధానంగా పరిష్కరించి నివేదికను మండల పరిషత్ కార్యాలయానికి అందించాలన్నారు. ప్రజలు చెల్లించే పన్నులతో జీతాలు తీసుకునే ఉద్యోగులు, ప్రజలకు సేవచేసేందుకు కట్టుబడి ఉండాలని అన్నారు. వాయిదా పడటంతో ప్రజాప్రతినిధులు, అధికారులు ఇలా వచ్చి అలా వెళ్ళిపోయారని స్థానిక ప్రజలు చర్చించుకుంటున్నారు. ఎంపీడీవో వెంకటేశ్వరరావు, వైస్ ఎంపీపీలు తమీం ఖాన్, లక్ష్మణ్ రెడ్డి, ఎంఈఓ చంద్రశేఖర్, వైద్యాధికారి మురళి, ఏవో ఆప్పోజి పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన అధికారులు, ప్రజాప్రతినిధులు

సమస్యలకు నిలయాలు ఎస్టీ కాలనీలు

- వర్షానికి ఉరుస్తున్న ఇండ్లు
- బురదమయమైన రోడ్లు
- కరెంట్ లేక చీకట్లోనే జీవితాలు
- ఓ వైపు ఏనుగుల భయం
- మరో వైపు విష జీవులతో సహవాసం

ప్రజాశక్తి- సోమల: సోమల మండలం నంజంపేట పంచాయతీ ఫిరంగుల గుట్ట, ఊసల గడ్డ ఎస్టీ కాలనీలలో సమస్యలు తిష్ట వేయడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఫిరంగుల గుట్ట గ్రామంలో 30 కుటుంబాల వారు నివసించడానికి మాజీ దివంగత ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు హయాంలో ఇండ్లు మంజూరు చేశారు. వాటిని నిర్మించిన గుత్తేదారు నాసిరకంగా నిర్మించడంతో నాటి నుండి నేటి వరకు వర్షం కురిస్తే ఇళ్లు ఉరుస్తూనే ఉంటుంది, ఆ ఇంటిలో ఉండలేక మరోదారి లేక వాటిల్లోనే నివాసాలు ఉంటున్నారు. పిల్లాపాపలతో వస్తువులు తడవకుండా వాటిపై ప్లాస్టిక్ పట్టలు కప్పి అలాగే కాపురం ఉంటున్నారు. ప్రస్తుతం గ్రామంలో ఆరు కుటుంబాలు ఊరుస్తున్న ఇళ్లలోనే ఉండగా మిగిలిన వారు గ్రామం వదిలి వేరే ప్రాంతాలకు వెళ్లారు. గ్రామం మొత్తం కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఈ కాలనీలకు విద్యుత్ సౌకర్యం ఉన్నా వీధి దీపాలు సక్రమంగా వెలగకపోవడంతో చీకట్లోనే మగ్గుతూ విషపురుగులతో సహవాసం చేస్తున్నామని వారు ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామ సౌకర్యార్థం ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మాణాన్ని గ్రామానికి ఎగువన నిర్మించేందుకు పిల్లర్లు వేశారని అయితే స్థలం అటవీ భూమిలో ఉందని అటవీ శాఖ వారు నిర్మాణాన్ని అడ్డుకోవడంతో ప్రస్తుతం నిర్మాణం నోచుకోక ఆగిపోయిందని గ్రామస్తులు తెలిపారు.

ఊసల గడ్డ గ్రామంలో 33 కుటుంబాల వారు గుడిసెలు వేసుకొని జీవనం సాగిస్తున్నారు. విద్యుత్ సౌకర్యం గ్రామానికి లేకపోవడం సరైన దారి సౌకర్యం లేక రెండు కిలోమీటర్ల దూరం మట్టి రోడ్డులోనే నడిచి వస్తుంటారు. వర్షం వస్తే బురదగుంటలలో రావాల్సి వస్తుందని, గ్రామంలో చిన్నారులు పాఠశాలకు వెళ్లాలన్నా ఇబ్బందిగా ఉందని గ్రామస్తులు వాపోయారు. పూర్తిగా అటవీ ప్రాంతంలో ఉండడంతో ఏనుగుల బెడద అధికంగా ఉందని, గతంలో ఒకసారి గ్రామంపై ఏనుగులు అర్ధరాత్రి వేళ దాడి చేసి పూరి గుడిసెలను ధ్వంసం చేసి ఇంటిలోని వస్తువులను చిందరవందర చేసి తీవ్రంగా నష్టపరిచాయని తమకు ఏనుగుల నుండి భద్రత కల్పించి గ్రామంలో నివాసయోగ్యమైన ఇండ్లు నిర్మించి విద్యుత్ సౌకర్యం కల్పించాలని అలాగే దారి సౌకర్యం ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు. గ్రామంలో ఎవరికైనా అనారోగ్య పరిస్థితులు ఎదురై ఆసుపత్రికి వెళ్లాలన్నా 108 వాహనం తమ గ్రామానికి రావడానికి కూడా సరైన దారి సౌకర్యం లేదని అధికారులు చొరవ చూపి సమస్యలు పరిష్కరించాలని కోరుతున్నారు.



దుస్థితిలో ఇండ్లు



ఫిరంగుల గుట్టలో నివాసాలు లేక నిరుపయోగంగా ఉన్న ఇండ్లు



సమస్యలు తెలుపుతున్న గ్రామస్తులు

ఉపాధ్యాయులు, అధ్యాపకుల కొరత

- ముందుకు సాగని విద్య
- పరీక్షల్లో తప్పిపోతున్న విద్యార్థులు
- మారని ప్రభుత్వ కళాశాలలు, పాఠశాల దుస్థితి


ప్రజాశక్తి -బైరెడ్డిపల్లి: విద్యా రంగానికి తమ ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని, ఉండటే ఉపాధ్యాయుల ఖాళీలను భర్తీ చేసేందుకు డిఎస్‌సి ప్రక్రియను చేపట్టి ఎంపిక ప్రక్రియ పూర్తి చేసి వెంటనే వారిని నియమిస్తామని కూటమి ప్రభుత్వం చెప్పింది. ఎంపిక పూర్తిచేసి త్వరిత గతిన వారిని నియమించక పోవడంతో మండలంలోని పాఠశాలలు, ప్లస్ టు పాఠశాలలో ఉపాధ్యాయుల, అధ్యాపకుల కొరత కొనసాగుతోంది. విద్యార్థుల విద్య సవ్యంగా ముందుకు సాగక కుంటు పడుతోంది. ఈ కారణంగా విద్యార్థులు పరీక్షల్లో కనీస ఉత్తీర్ణత మార్కులు కూడా సాధించలేని దుస్థితి ఏర్పడింది. త్వరగా డిఎస్‌సిలో ఎంపికైన ఉపాధ్యాయులతో ఖాళీలు భర్తీ చేసి విద్య పారదర్శకంగా అందించాలని స్థానికులు కోరుతున్నారు.

ముందుకు సాగని విద్య

మండలంలోని కమ్మపల్లి మోడల్ స్కూల్‌లో గత కొన్ని సంవత్సరాలుగా కెమిస్ట్రీ లెక్చరర్ లేకపోవడం, ఫిజికల్ డైరెక్టర్ పోస్టు ఖాళీగా ఉండడం, విద్యార్థులపై తీవ్ర ప్రభావం చూపుతోంది. తల్లిదండ్రులు ప్రైవేట్‌గా అధ్యాపకుడిని నియమిం చుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. 640 మంది విద్యార్థులు ఉన్న ఈ ప్లస్ టూ కళాశాలలో సదుపాయాల లేమి కారణంగా విద్య ముందుకు సాగడంలేదు. ఈ అంశంపై జిల్లా విద్యాశాఖ అధికారిణిని ఫోను ద్వారా సంప్రదించగా వారంలోపు కెమిస్ట్రీ లెక్చరర్‌ను మోడల్ స్కూల్‌కి పంపుతామని హామీ ఇచ్చారు.

ప్రభుత్వం స్పందించాలి

వైద్యం, విద్య లాంటి ప్రాథమిక రంగాల్లో ఎదురవుతున్న సమస్యలు ప్రజల ఆరోగ్యం, విద్యార్థుల భవిష్యత్తుపై బలమైన ప్రభావం చూపిస్తున్నాయి. అధ్యాపకుల కొరత కారణంగా విద్యార్థులు పలు సబ్జెక్టుల్లో కనీస మార్కులు కూడా సాధించక తప్పిపోతున్నారు. ఉచిత పథకాలపై కాక, విద్య వైద్య రంగాలపై శ్రద్ధ పెట్టాల్సిన అవసరం వుందని స్థానికులు పేర్కొంటున్నారు. ప్రభుత్వం, సంబంధిత అధికారులు వెంటనే స్పందించి విద్యా సంస్థలలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ, అధ్యాపకుల పోస్టులను అత్యవసరంగా భర్తీ చేసి, మౌలిక వసతులు మెరుగుపరచి, గ్రామీణ ప్రాంతాల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.


పత్రికల వారికి తమ సమస్యలు వివరిస్తున్న విద్యార్థులు

క్రైం న్యూస్

అసాంఘిక కార్యకలాపాలపై దాడి

ప్రజాశక్తి -గంగాధర నెల్లూరు: గంగాధర నెల్లూరు మండలం పెద్ద కాలువ పంచాయతీ పరిధిలోని చెర్లోపల్లి సమీపంలో ఓ అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తున్న (వ్యభిచారం) ఇంటిపై సీఐ శ్రీనివాసంతి ఆధ్వర్యంలో పోలీసులు దాడిచేసి అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా అక్కడ ఈ కార్యకలాపాలను ఓ మహిళ నిర్వహిస్తున్నట్లు , అక్కడ ఇద్దరు మహిళలు, ఇద్దరు విటులను పట్టుకున్నట్లు సీఐ పేర్కొన్నారు. నాలుగు నెలల క్రితం సైతం ఇదే ప్రాంతంలో ఇదే మహిళ వ్యభిచారం నిర్వహిస్తుండగా దాడి చేసి పట్టుకుని కేసునమోదు చేసామని సీఐ తెలిపారు.

టపాసుల గోడౌన్ల తనిఖీ

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: జిల్లాలో లైసెన్సు లేకుండా నిర్వహిస్తున్న టపాకాయల దుకాణాలు, టపాకాయలు నిల్వ వుంచిన గోడౌన్లను రెవెన్యూ అధికారులతో కలిసి గురువారం తనిఖీలు నిర్వహించారు. చిత్తూరు 1 టౌన్, 2 టౌన్ పోలీసు స్టేషన్ల పరిధిలోని గోదాములు, అంగళ్లు, రిటైల్ షాపులను పరిశీలించారు. అగ్ని మాపక పరికరాలు, సరైన గాలి ప్రసరణ, భద్రతా దూరం పాటించడం, విద్యుత్ కనెక్షన్ల భద్రత, సిబ్బంది అవగాహన స్థాయి వంటి అంశాలను పరిశీలించారు. లైసెన్స్ లేకుండా టపాసులు నిల్వ ఉంచే, విక్రయించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.

బంగారుపాలెం: బంగారుపాలెం మండలం సంక్రాంతి పల్లి గ్రామంలో టపాకాయ కేంద్రాన్ని సీఐ శ్రీనివాసులు గురువారం తనిఖీ చేశారు. విక్రయ కేంద్రం వద్ద తగిన వసతులు కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుల్ రమేష్ టపాకాయలు విక్రియ కేంద్రం యజమాని పాల్గొన్నారు.

ఎస్ఆర్ పురం : కలెక్టర్ సుమిత్ కుమార్, చిత్తూరు రెవెన్యూ డివిజనల్ అధికారి ఆదేశాల మేరకు ఎస్ఆర్ పురం మండలంలోని 49. కొత్తపల్లి మిట్ట, పిళ్ళారి కుప్పం క్రాస్ , పుల్లూరు క్రాస్ టపాసు గోడౌన్లను ఎస్ఆర్ పురం తహశీల్దారు లోకనాథ పిళ్లై గురువారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా కొత్తపల్లె చెందిన భాగ్యరాజ్ కొటార్లపల్లె చెందిన హేమంత్ కుమార్ , పుల్లూరు క్రాస్ చెందిన చంద్రబాబు నాయడు , పిళ్ళారి కుప్పం క్రాస్ చెందిన నాగరాజ్ శెట్టి టపాసు ల గోడౌన్లను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

అమ్మాయిల బాత్‌రూంలో హిడెన్ కెమెరా

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: స్థానిక మురుకంబట్టిలోని అపోలో యూనివర్సిటీలో కొత్తగా నిర్మి స్తున్న భవనంలో అమ్మాయిల బాత్‌రూంలో హిడెన్ కెమెరాలు యూనివర్సిటీ నిర్వాహకులు గుర్తించారు. ఈ భవన నిర్మాణాన్ని చెన్నైకి చెందిన హరి నారాయణ కన్‌స్ట్రక్షన్ నిర్మిస్తోంది. బాత్‌రూంలో హిడెన్ కెమెరాను అమర్చింది సైట్ ఇంజనీర్ రూబిన్ అయి ఉంటాడనే అనుమానంతో చిత్తూరు తాలూకా పోలీస్ స్టేషన్లో అపోలో యూనివర్సిటీ నిర్వాహకులు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు చిత్తూరు డిఎస్పి సాయినాథ్, తాలూకా సిఐ నిత్య బాబు గురువారం అపోలో యూనివర్సిటీని తనిఖీ చేసి బాత్రూంలో అమర్చిన హిడెన్ కెమెరాలు బయటికి తీశారు. కెమెరాలు ఎలాంటి రికార్డులు లేవని తెలిపారు. ఈ మేరకు అమ్మాయిల బాత్రూం లో కెమెరాలు ఏర్పాటు చేసింది ఎవరనే విషయాన్ని గుర్తించేందుకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



ఉపాధి వార్షిక ప్రణాళికపై శిక్షణ

ప్రజాశక్తి-పెద్దపంజాణి: గ్రామీణ ఉపాధి వార్షిక ప్రణాళిక తయారీపై మండల స్థాయి అధికారులకు , సంబంధిత శాఖల అధికారులకు మండల పరిషత్ కార్యాలయ సముదాయంలో ఉపాధి సిబ్బంది పంచాయతీ కార్యదర్శులు, లైన్ డిపార్ట్మెంట్ సిబ్బందికి గురువారం శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో బాలాజీ, ఉపాధి ఏపీవో మురుగేషన్ మండల వ్యవసాయ అధికారిణి హేమలత పాల్గొన్నారు.

వివో లీడర్లు, సంఘమిత్రలతో ఏపీఎం సమీక్ష

ప్రజాశక్తి -గంగాధర నెల్లూరు: గంగాధరనెల్లూరు మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో వివో లీడర్లు సంఘమిత్రలతో గురువారం ఏపిఎం ఫరీద్ మస్తాన్ ఆధ్వర్యంలో సమీక్షించారు. ఈ సందర్భంగా ఏపిఎం ఫరీద్ మస్తాన్ మాట్లాడుతూ ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాద రావు ఆధ్వర్యంలో చిత్తూరు నగరంలోని పివికెఎన్ కళాశాలలో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారన్నారు. శనివారం ఉ. 8 గంటల నుండి ప్రారంభమయ్యే ఈ శిబిరానికి ఉదయం 7 గంటల లోపు చేరుకుని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రత్యేకంగా స్వయం సహాయక మహిళలు తప్పక వినియోగించుకోవాలని ఏపిఎం తెలిపారు.

నారాయణస్వామిని అరెస్టు చేయాలి: టిడిపి

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్:

దేవళంపేట అంబేద్కర్ విగ్రహం దగ్ధం కేసులో సూత్రధారి మాజీ డిప్యూటీ సిఎం నారాయణస్వామి అరెస్టు చేయాలని కోరుతూ గురువారం టిడిపి శ్రేణులు గాంధీ విగ్రహం నుండీ అంబేద్కర్ విగ్రహం వరకు నిరసన ర్యాలీ చేపట్టారు. అంబేద్కర్ విగ్రహం వద్ద జీడీ నెల్లూరు ఎంఎల్ఏ థామస్, టిడిపి జిల్లా అధ్యక్షులు టిఆర్ రాజన్, నగర మేయర్ అముద, రాష్ట్ర ఎస్సీ సెల్ అధ్యక్షులు అశోక్, చూడ ఛైర్‌పర్సన్ కఠారి హేమలత, మాట్లాడుతూ ఉదేశ్యపూర్వకంగా అధికార పార్టీని అబాసుపాలు చేసేలా నారాయణస్వామి రాజాగ్య నిర్మాతను అవమానపరిచేలా వ్యవహరించారని ఆరోపించారు. సర్పంచ్ గోవిందయ్యాను పావులా వాడుకున్న వారిపై కఠినచర్యలు తీసుకోవాలన్నారు. ఈ కేసులో గోవిందయ్యతో పాటు వెనుక ఉన్న వ్యక్తులపై సమగ్ర విచారణ జరిపి దోషులను కఠినంగా శిక్షించాలని కోరారు.

ప్రజల ప్రాణాలు కాపాడండి

వైసిపి మహిళల నిరసన

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: 'నారా కల్తీ మద్యం నుండీ ప్రజల పాణాలను కాపాడండి' అంటూ స్థానిక మిట్టూరులోని ఎక్సైజ్ అర్బన్ కార్యాలయం ఎదుట వైసిపి మహిళా విభాగం ఆధ్వర్యంలో మహిళలు ధర్నా చేశారు. కల్తీ మద్యం అరికట్టి ప్రజల ప్రాణాలు కాపాడలంటూ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వైసిపి మహిళా విభాగం నాయకులు అంజలి రెడ్డి, గాయత్రి దేవి, హరిని రెడ్డి, లీన రెడ్డిలు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చాక రాష్ట్రంలో మద్యం ఏరులైపారుతోందన్నారు. బెల్టుషాపులు, అధికార పార్టీకి చెందిన కొందరు అక్రమ మద్యం తయారు చేస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటం అడుతూ కోట్లు గడిస్తున్నారని ఆరోపించారు. నాడు వైఎస్ జగన్ క్రమంగా మద్యం అమ్మకాలు తగ్గిస్తే నేడు కూటమి ప్రభుత్వం విచ్చవిడి అమ్మకాలను ప్రోత్సహించడమే కాకుండా అక్రమ తయారీదారులకు కొమ్ముకాస్తోందన్నారు.

విద్యార్థులకు పద్య పోటీలు

ప్రజాశక్తి -పలమనేరు రూరల్ (గంగవరం): తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి ఆధ్వర్యంలో పాఠశాల స్థాయి విద్యార్థులకు జాతీయ స్థాయి శతక పద్య పోటీలు నిర్వహిస్తున్నట్లు సంస్థ అధ్యక్ష కార్యదర్శులు పి తులసినాథం నాయుడు, పుష్ప ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. సంస్థ 13వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని ఈ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. వందకు పైగా పద్యాలు చెప్పగలిగిన పిల్లలు ఈ నెల 16వ తేదీ లోపు 9553429770 నెంబకు ఫోన్ చేసి తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు

పోషణ్ కార్యక్రమం ప్రారంభం

ప్రజాశక్తి - చిత్తూరు (యాదమరి): స్థానిక చిత్తూరు పట్టణంలోని కొంగారెడ్డిపల్లిలో సిడిపిఓ కార్యాలయంలో పోషణ్ మాహ్‌ను 2025ను గురువారం ప్రారంభించారు. రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు షేక్ రోఖయా బేగం, చిత్తూరు జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ వెంకటేశ్వరి ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆరు సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్నపిల్లలు, కౌమారదశలో ఉన్న బాలికలు, గర్భిణులు, పాలిచ్చే తల్లులు లక్ష్యంగా ప్రతి అంగన్‌వాడీ కేంద్రాలలో మంచి పౌష్టి క ఆహారాన్ని పంపిణీ చేస్తున్నామని తెలిపారు. గర్భిణులు, పాలు ఇచ్చే తల్లులు, మహిళలు పూర్తి స్థాయిలో పోషకాలు అందే ఆహారం తీసుకోవాలని, తద్వారా ఆరోగ్యకరమైన పిల్లలు పుట్టి రేపటి రాబోయే రోజుల్లో భావి భారత పౌరులుగా అవుతారని పేర్కొన్నారు. పీడీ వెంకటేశ్వరి మాట్లాడుతూ చిత్తూరులో అన్నీ చోట్ల పోషణ మహా కార్యక్రమం ద్వారా చక్కటి అవగాహన లభిస్తుందన్నారు. ఈ కార్య క్రమంలో సిడిపిఓ సుగుణకుమారి, డిసిపిఓ సుబ్రహ్మణ్యం, ఐసిడిఎస్ సూపర్ వైజర్స్, అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్, గర్భిణులు పాల్గొన్నారు.

బడికి రాని పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ: హెచ్ఎం


విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న దృశ్యం

ప్రజాశక్తి -సోమల: పాఠశాలలో పేరు నమోదు అయి రోజుల తరబడి పాఠశాలకు గైర్హాజరవుతున్న విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించి వారి ఇళ్ల వద్దకు వెళ్లి తల్లిదండ్రులతో మాట్లాడి ఒప్పించి తిరిగి పాఠశాలలకు రప్పిస్తామని ఇరికిపెంట పంచాయతీ వడ్డిపల్లి ప్రాథమిక పాఠశా ల ప్రధానోపాధ్యాయురాలు పిఆర్ శ్రీదేవి పేర్కొన్నారు. గురువారం పాఠశాలకు హాజరు కాని పలువురు విద్యార్థుల ఇళ్ల వద్దకు వెళ్లి వారి కుటుంబ సభ్యులతో, తల్లిదండ్రులతో మాట్లాడి పాఠశాలకు ప్రతి రోజూ పంపించాలని ప్రభుత్వం విద్యార్థుల కోసం ఉచిత పాఠ్య పుస్తకాలు, యూనిఫామ్, మధ్యాహ్న భోజనం, తల్లికి వందనం, తదితర పథకాల అందిస్తోందని విద్యార్థులను పాఠశాలలకు పంపి వీటిని సద్వినియోగం చేసు కోవాలని సూచించారు. బాగా చదివించి ఉన్నతులను చేయా లని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

నీట్‌లో గ్రామీణ విద్యార్థికి ఉత్తమ ర్యాంకు


తల్లిదండ్రులతో విద్యార్థి

ప్రజాశక్తి -కార్వేటినగరం : జాతీయ స్థాయిలో నీట్ పరీక్షల్లో చిత్తూరు జిల్లా కార్వేటినగరం మండలం డిఎంపురం పంచాయతీ పరిధిలోని సూరప్ప నాయుడు కండ్రిగ గ్రామానికి చెందిన వెయ్యి రాధాకృష్ణ యాదవ్, లోకేశ్వరి దంపతుల కుమారుడు ధనుష్ యాదవ్ (60282) ర్యాంకు సాధించాడు. గ్రామీణ ప్రాంతంలో పుట్టి పుత్తూరు లో చదివి విజయవాడలో చదివి నీట్‌లో 720 మార్కులకు 493 మార్కులు సాధించి ఉత్తమ ర్యాంకు సాధించాడు. వై ధనుష్ యాదవ్‌కు ఎస్‌సి సుబ్బారెడ్డి ప్రభుత్వ కళాశాల నెల్లూరులో ఎంబిబిఎస్‌కు సీటు లభించింది. దీంతో గ్రామీణ ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు. పంచాయతీ మాజీ సర్పంచ్ వెంకటముని ధనుష్‌ను అభి నందించారు. ధనుష్ యాదవ్ తల్లి లోకేశ్వరి టీచర్‌గా పని చేస్తోంది. ధనుష్ యాదవ్‌కు పలువురు శుభాకాంక్షలు తెలిపారు.



అర్ధగిరికి రూ.17.35 లక్షల ఆదాయం

ప్రజాశక్తి-తవణంపల్లి:

తవణంపల్లి మండలంలోని అర్ధగిరి వీరాంజనేయ స్వామి దేవస్థానంలో గత 122 రోజుల హుండీ లెక్కింపులో రూ.17,35,350 ఆదాయం వచ్చినట్లు దేవస్థానం ఈవో మునిశేఖర్ తెలిపారు. అదనంగా బంగారం 3.600 మిల్లీ గ్రాములు, వెండి 102 గ్రాములు లభ్యమయ్యాయి. ఈ కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ శ్వేత, గ్రామీణ బ్యాంకు అసిస్టెంట్ మేనేజర్, గ్రామస్తులు రంజిత్ రెడ్డి, ఏ. రఘుపతి పాల్గొన్నారు.

పలమనేరు ఏరియా ఆస్పత్రి తనిఖీ

ప్రజాశక్తి -పలమనేరు: పలమనేరు ఏరియా ఆస్పత్రిని డిసిహెచ్ఎస్ పద్మజ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పలమనేరు ఏరియా ఆస్పత్రిలో జరుగుతున్న అవకతవకలు, విలువైన సామాగ్రిని ఔట్సోర్సింగ్ సిబ్బంది దొంగతనంగా తరలించడం, బాధ్యులైన ఔట్సోర్సింగ్ సిబ్బందిని తొలగించడం వారిపైన పోలీసు కేసు రిజిస్టర్ కావడం నేపథ్యంలో ఆమె ఆస్పత్రిని సందర్శించారు. జీఎస్టీ తగ్గింపుపై అవగాహన కల్పించారు.


ఎంఈవో కు వినతిపత్రం అందిస్తున్న ఉపాధ్యాయ సంఘాల నాయకులు

యాప్‌ల గోల మాకొద్దు: యుటిఎఫ్

ప్రజాశక్తి -బంగారుపాళ్యం: విద్యార్థులకు విద్య నేర్పించేందుకు సమయాన్ని కేటాయించాలని యుటిఎఫ్ మండల అధ్యక్షులు మహేష్ బాబు అన్నారు. మండల ఎంఈవో2 రమేష్ బాబుకు ఫ్యాప్టో పిలుపుమేరకు గురువారం సాయంత్రం వారు వినతిపత్రం అందించారు. శుక్రవారం నుంచి యాప్‌ల నమోదు చేయబోమని విద్యార్థులు హాజరు పట్టిక, విద్య, మధ్యాహ్న భోజనం మాత్రమే విధుల్లో చేపడుతామని యాప్‌ల గోల మాకు అవసరం లేదు' అంటూ వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి మోహన్ రెడ్డి ఎస్‌టియు అధ్యక్షులు లక్ష్మీపతి, ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్, ఏపీటీఎఫ్ సభ్యులు నవీన్ కుమార్, ఉపాధ్యాయులు జగదీష్, మాధవ నాయుడు, రమేష్, రామకృష్ణ, విద్యాసాగర్, మార్కొండయ్య పాల్గొన్నారు.

పారిశుధ్య పనులు ముమ్మరం

ప్రజాశక్తి -సోమల: సోమల మండలం నంజంపేట గ్రామంలో పంచాయతీ కార్యదర్శి మణికుమార్ ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులు గురువారం కాలువలలో పూడికతీత, పిచ్చి మొక్కలు తొలగింపు నిర్వహించారు. ఇటీవల కురుస్తున్న వర్షాల కారణంగా మురుగునీరు కాలువల్లో, రోడ్లపై వర్షపు నీరు, రోడ్లకు ఇరువైపులా పిచ్చి మొక్కలు పెరిగి దోమలకు నిలయంగా మారుతున్నాయన్నారు. దోమల నివారణకు పారిశుధ్య పనుల్లో భాగంగా బ్లీచింగ్ చల్లుతున్నామని కార్యదర్శి తెలిపారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్ఐ రమేష్‌కు ఘన సన్మానం

ప్రజాశక్తి -కార్వేటినగరం: కార్వేటినగరం ట్రైనింగ్ సబ్ ఇన్‌స్పెక్టర్ రమేష్ గురువారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ట్రాఫిక్ నియంత్రణపై ప్రత్యేక దృష్టి చేపడ తానన్నారు. ఈ సందర్భంగా టిడిపి మండల అధ్యక్షులు చెంగల్రాయ యాదవ్, ఎమ్మెల్యే సోదరులు వి రాజా, టిడిపి నాయకులు హేమంత్ రెడ్డి, బాలాజీ, యువ నాయకుడు పొద్దుటూరు రాజా తదితరులు ఎస్ఐని కలిసి శాలువా కప్పి ఘనంగా సన్మానించారు.


ఎస్‌ని సన్మానిస్తున్న నాయకులు

ఘనంగా ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం

ప్రజాశక్తి -కార్వేటినగరం : జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల, కత్తెరపల్లెలో ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా మానసిక ఆరోగ్యంపై అవ గాహన కార్యక్రమాలు గురువారం నిర్వ హించారు. ఈసందర్భంగా విద్యార్థు లకు వ్యాసరచన పోటీలు, పోస్టర్ మేకింగ్ పోటీలు, మైండ్ రిలాక్సేషన్ కార్యక్రమలు నిర్వ హించారు. అనంతరం విద్యార్థులు మానసిక ఆరోగ్య ప్రాధాన్య తపై ర్యాలీ నిర్వహించి ప్రజల్లో చైతన్యం కలిగించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కెరీర్ మెంటల్ హెల్త్ కౌన్సిలర్స్ టి సౌజన్య, పి వాణి పాల్గొని విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పశువైద్య శిబిరం

ప్రజాశక్తి -వెదురుకుప్పం: పాడి పశువుల గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరాన్ని సంతబైలులో వెదురుకుప్పం ప్రాంతీయ పశువైద్యశాల సహాయసంచాలకులు డా రూప సుందరి ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టరు యశోద, పుత్తూరు డివిజన్ ఉప సంచాలకులు డాక్టరు గోవిందయ్య, వెదురుకుప్పం మండల పశు వైద్యాధికారి డాక్టరు రాజేష్, పాల్గొన్నారు.

జీఎస్‌టీపై అవగాహన

ప్రజాశక్తి-ఐరాల: ఐరాల ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి డాక్టర్ రెడ్డప్ప ఆధ్వర్యంలో డాక్టర్ శ్రీవాణి, ఆయుష్ డిపార్ట్మెంట్, డాక్టర్ వెంకటేశ్వరరావు డెంటిస్ట్ సూపర్ జీఎస్‌టీపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఓ ఆదిలక్ష్మి , హెల్త్ సూపరువైజర్ చిన్నమ్మ , మేల్ హెల్త్ అసిస్టెంట్ మునిరత్నం, ఆస్పత్రి వైద్య సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

పలమనేరు: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 'సూపర్ జీఎస్టీటి అండ్ సూపర్ సేవింగ్స్" ఇన్ ఇండియా అండ్ ఆంధ్రప్ర దేశ్ అనే అంశంపై కళాశాల ప్రిన్సిపాల్ యం. వెంకటేశులు ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ అసిస్టెంట్ కమీషనర్ హరిప్రసాద్, నరసింహులు, ఆఫీసర్ యోగేందర్ నాయుడు పాల్గొన్నారు. వక్తృత్వపు పోటీలు నిర్వహించి బహుమతులు పంపిణీ చేశారు.

గజ ప్రజ యాప్ డెమో పరిశీలన

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: గజ ప్రజా అనే యాప్, రైతులకు విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని డిఆర్ఓ మోహన్ కుమార్ పేర్కొన్నారు. స్థానిక కలెక్టరేట్లోనే డిఆర్ఓ సమావేశ మందిరంలో 'గజ ప్రజ' అనే యాప్, డెమోను ఫారెస్ట్ అధికారులతో కలిసి గురువారం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వైల్డ్ లైఫ్ ఎక్స్పర్ట్ రాకేష్ కల్ప, పలమనేరు ఆర్‌డిఓ భవాని, సబ్ డివిజనల్ ఫారెస్ట్ అధికారి వేణుగోపాల్, చిత్తూరు ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ పట్టాభి, పుంగనూరు ఫారెస్ట్ ఆఫీసర్ శ్రీరాములు పాల్గొన్నారు.

బాలికలకు అవగాహన

పలమనేరు : పలమనేరు ఏపీఎస్‌డబ్ల్యుఆర్ గురుకుల బాలికల పాఠశాలలో జనవిజ్ఞాన వేదిక, సమతా భాగం ఆధ్వర్యంలో 'ఎదిగే ఆడపిల్ల' ఏమి తెలుసుకోవాలి?' అనే అంశంపై అవగాహన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు జిల్లా సమత విభాగం కన్వీనరు పాపుదేసి జయంతి, జన విజ్ఞాన వేదిక సమతా విభాగం అధ్యక్షులు అరుణ్ శివ ప్రసాద్, ప్రధాన కార్యదర్శి యుగంధర్ బాబు, కోశాధికారి గిరిధర్ మూర్తి, పర్యావరణవేత్త సుధాకర్, ప్రిన్సిపాల్ ప్రశాంతి పాల్గొన్నారు.

'మామిడి రైతుల ఆక్రందన సభ'ను జయప్రదం చేయండి

ప్రజాశక్తి -పలమనేరు రూరల్ (గంగవరం): బంగారు పాళ్యం మార్కెట్ యార్డులో ఈ నెల 15వ తేదీ నిర్వహించనున్న మామిడి రైతుల ఆక్రందన సభను జయప్రదం చేయాలని ఉమ్మడి చిత్తూరు జిల్లా మామిడి రైతు సంఘం ఆధ్వర్యంలో గురువారం కరపత్రాలు ఆవిష్కరించారు. పలమనేరు చుట్టుపక్కల ప్రాంతాల రైతులకు కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మామిడి రైతు సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డాక్టర్ టి జనార్ధన్, సి మునీశ్వర్‌రెడ్డిలు మాట్లాడుతూ ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 50 వేల మంది మామిడి రైతులు నాలుగు నెలలుగా మామిడి సరఫరా చేసిన బిల్లుల కోసం పడిగాపులు పడుతున్నా చలనం లేకపోవడం దుర్మార్గమన్నారు. ముఖ్యమంత్రి స్వయంగా (ఎనిమిది ప్లస్ నాలుగు) 12 రూపాయలు చొప్పున డబ్బులు చెల్లిస్తామని చెప్పి రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ నిధులు విడుదలైనా చెల్లింపు విషయంలో జాప్యం ఎందుకని వారు ప్రశ్నించారు. జిల్లా వ్యాప్తంగా గుజ్జు ఫ్యాక్టరీ యజమానులు, ర్యాంపు నిర్వాహకులు ప్రభుత్వ నిర్ణయాన్ని బేఖాతరు చేయడం రైతుల పట్ల ప్రభుత్వానికి ఎంత నిర్లక్ష్యమో చెబుతోందన్నారు. ఈ సభను పెద్ద ఎత్తున జయప్రదం చేయాలని వారు కోరారు. మామిడి రైతులకు ఇప్పటివరకు చెల్లించాల్సిన రూ.500 కోట్లు చెల్లించకుంటే భవిష్యత్ కార్యక్రమాన్ని, ఉద్యమ తీవ్రతను ఈ నెల 15న ప్రకటిస్తామని పేర్కొన్నారు. అఖిల పక్ష పార్టీల తోడ్పాటుతో పార్టీలకు అతీతంగా ఈ సభ నిర్వహించనున్నట్లు వారు పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం గుజ్జు యజమానులు, ర్యాంపు నిర్వాహకులు నిబంధనల మేరకు రైతులకు చెల్లించాల్సిన మొత్తం బకాయలు ఇప్పించాలని కోరారు. ఈ కార్యక్రమం లో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కె సురేంద్రన్, కోశాధికారి పిఎల్ సంజీవ రెడ్డి ఉపాధ్యక్షులు బి మురళి, జి త్యాగరాజ రెడ్డి కార్యదర్శి యు సందీప్, తవణంపల్లె అధ్యక్షులు మోహన్ రెడ్డి పాల్గొన్నారు.


'మామిడి రైతుల ఆక్రందన సభ' కరపత్రాలు ఆవిష్కరిస్తున్న దృశ్యం

ఓట్ల దొంగతనాన్ని అరికట్టాలి

ప్రజాశక్తి -కార్వేటినగరం : గంగాధరనెల్లూరు నియోజకవర్గం కార్వేటినగరంలో గురువారం 'ఓట్ చోర్.. గద్దీ చోడ్..'ను దిగ్విజయంగా నిర్వహించారు. గంగాధర్ నెల్లూరు నియోజక వర్గం కార్వేటినగరంలో కాంగ్రెస్ శ్రేణులు సమక్షంలో సంతకాల సేకరణ నిర్వహించారు. బీజేపీ పాలనకు వ్యతిరేకంగా నిరసన తెలుపుతూ సంతకాల సేకరణ నిర్వహించారు. ఇందులో భాగంగా సీనియర్ నాయకులు గోవర్ధన్ రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షులు గౌతమ్‌రాజు, మహిళా నాయకురాలు రాజేశ్వరమ్మ , సీనియర్ నాయకులు శివకుమార్ రెడ్డి , కొత్తగా నియమితులైన యూత్ కాంగ్రెస్ మండ ల ప్రెసిడెం ట్ ఉదయ్ కుమార్, నాయకులు ప్రిన్స్ కృష్ణ మూర్తి పాల్గొ న్నారు. ఈ కార్యక్రమంలో ఉదయకుమార్ ని మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులుగా నియమించారు. బీజేపీ సీనియర్ నాయకులు శివలింగం కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు.



సంతకాలు సేకరిస్తున్న కాంగ్రెస్ నాయకులు

సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ స్థల పరిశీలన

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: చిత్తూరు నగరపాలక సంస్థ కమిషనర్ పినరసింహ ప్రసాద్ గురువారం కట్టమంచి మామిడికాయల మండి ప్రాంతంలో ఏర్పాటు అనుకూలంగా వుంటుందని పరిశీలించారు. సీవరేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్ (ఎస్‌టిపి) నగరంలో నీటి కాలుష్యాన్ని తగ్గించడానికి, పర్యావరణాన్ని మెరుగుపరచడానికి సుమారు రూ.34 కోట్లతో ఏర్పాటు చేయనున్న ఈ ప్రాజెక్ట్ కీలకంగా మారనున్నదని కమిషనర్ పి.నరసింహ ప్రసాద్ తెలిపారు. గురువారం కమిషనర్ అధికారులు, ఇంజనీర్లు, స్థానిక ప్రతినిధులతో ఎస్‌టిపి నిర్మాణం, ప్రాజెక్ట్ రోడ్‌మ్యాప్, భవిష్యత్ నిర్వహణ పద్ధతులు గురించి సమగ్రంగా చర్చించారు. కమిషనర్ మాట్లాడుతూ చిత్తూరు నగరంలోని నీటి నాణ్యతను పెంచడం, కాలుష్యాన్ని తగ్గించడం, పర్యావరణ హిత విధానాలను అభివృద్ధి చేయడానికి ప్రాధాన్యత అన్నారు. ప్రాజెక్ట్ పూర్తి అయిన తర్వాత నగరంలోని గృహాల నుంచి వచ్చే సీవరేజ్‌ను సమర్థవంతంగా శుద్ధి చేయడం ద్వారా స్థానిక నదులు, కూల్ వాటర్ గడ్డలు, పర్యావరణ పర్యవేక్షణకు మేలు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో పబ్లిక్ హెల్త్ విభాగం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఏ.పుష్పగిరి నాయక్, ఇంజనీర్ ఎంఇ.వెంకటరామి రెడ్డి, ఎసీపీ నాగేంద్ర, ఎంహెచ్వో డాక్టర్ లోకేష్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

నిరాశ్రయులకు దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరపాలక సంస్థ మెప్మా సహకారంతో సపోర్ట్ సంస్థ నిర్వహిస్తున్న నిరాశ్రయుల వసతి గృహంలో ప్రపంచ నిరాశ్రయుల దినోత్సవం ముందస్తు సంబరాల్లో భాగంగా ఆ సంస్థ అధ్యక్షులు జోసఫ్ రాజు ఆధ్వర్యంలో గురువారం దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా యువజన అధికారి బి ప్రదీప్‌కుమార్ మాట్లాడుతూ నిరాశ్రయులు కూడా గతంలో కుటుంబ సభ్యులతో కలిసి ఉండేవారన్నారు. అయితే ఎవరు లేకపోవడంతో నిరాశ్రయుల వసతి గృహంలో ఉంటున్న కుటుంబ సభ్యులతో కలిసి ఉండే ఆహ్లాదాన్ని కల్పిస్తున్న జోసఫ్ రాజు సేవలు అభినందనీయమన్నారు. వారితో కలిసి ప్రపంచ నిరాశ్రయుల దినోత్సవం ముందస్తు సంబరాలు చేసుకోవడం ఎంతో సంతోషాన్ని ఇస్తుందన్నారు. సపోర్ట్ సంస్థ నిర్వాహకులు నిరాశ్రయు లకు అంది స్తున్న సహకారం మరువ లేనిదన్నారు. ప్రాంతీయ గణాంక అధికారి ఎంసి బాబు రెడ్డి మాట్లా డుతూ నిరాశ్ర యులను కాపాడటం, ప్రేమ చూపడం మన అందరి బాధ్యత అన్నారు. వసతి గృహ నిర్వాహకులు సపోర్టు సంస్థ అధ్యక్షులు పి జోసెఫ్ రాజు మాట్లాడుతూ నిరాశ్రయులకు అవసరమైన సోపులు, పేస్ట్, బ్రష్, కొబ్బరినూనె, పౌడరు, షాంపు, దువ్వెన వాళ్లకు కావాల్సిన పది రకాల వస్తువులు అందించారు. జిల్లా యువజన అధికారి బి ప్రదీప్ కుమార్ నిరాశ్రయులకు దుప్పట్లు అందించారు. ఈ కార్యక్రమంలో వసతి గృహ సిబ్బంది ప్రమీల, శ్రీజ, శ్రీను, ఇంద్రాణి పాల్గొన్నారు.




దుప్పట్లు పంపిణీ చేస్తున్న దాత

కుప్పం అభివృద్ధిలో 'కడ' కృషి అభినందనీయం

ప్రజాశక్తి- కుప్పం: సీఎం చంద్రబాబు ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పం నియోజకవర్గ సమగ్రాభివృద్ధిలో కుప్పం డెవలప్మెంట్ అథారిటీ (కడ) కృషి అభినందనీయమని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ పేర్కొన్నారు. స్వచ్ ఆంధ్ర.. స్వర్ణాంధ్ర అవార్డుల ప్రధానోత్సవంలో స్వచ్ఛ కార్యాలయంగా కడ ఎంపిక కాగా సీఎం చంద్రబాబు చేతుల మీదుగా కడ పీడీ వికాస్ మర్మత్ రాష్ట్రస్థాయి అవార్డు అందుకున్నారు. దీంతో కుప్పం కడ కార్యాలయంలో పీడీ వికాస్ మర్మత్‌ను ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ ఘనంగా సత్కరించారు. కుప్పం అభివృద్ధిలో కడ పీడీ వికాస్ మర్మత్ ఎంతగానో కృషి చేస్తున్నారని ఆయన ప్రశంసించారు. కుప్పం అభివృద్ధికి ప్రతి ఒక్కరూ అంకితభావంతో పనిచేయాలని అభివృద్ధిలో ప్రజలు భాగస్వాములు కావాలని ఎమ్మెల్సీ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కౌన్సిలర్ జాకీర్ మాజీ ఎంపీటీసీ ఉమాపతి, మైనార్టీ నేత ఫైరోజ్ పాల్గొన్నారు.

పాఠశాలల్లో బోధనేతర పనులు బహిష్కరణ

ప్రజాశక్తి-పెద్దపంజాణి: నేటి నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో బోధనేతర పనులను బహిష్కరిస్తున్నట్లు మండల విద్యాశాఖ అధికారులకు మండల ఫ్యాప్టో నాయకు లు గురువారం మండల విద్యాశాఖాధి కారికి మెమరాండం అందజేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ఫ్యాప్టో పిలుపుమేరకు ఈనెల 10వ తేదీ నుంచి రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో బోధనేతర పనుల బహిష్కరణ అమలు చేస్తున్నట్లు ఫ్యాప్టో నాయకులు తెలిపారు. ఇటీవల కాలంలో పాఠశాలల్లో ప్రభుత్వం అమలు చేస్తున్న కర్మయోగి, విద్యా శక్తి, జీఎస్టీ పై ప్రచారం, మూల్యాంకన బుక్ లెట్స్, స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర, రకరకాల యాప్స్ వంటి కార్యక్రమాల వల్ల పాఠశాలలో పిల్లలకు సరైన విద్య అందించలేక పోతున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇప్పటికైనా ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణకు కృషి చేయాలని ఉపాధ్యాయులకు విద్య బోధించడం తప్ప ఇతర పనులకు ఉపాధ్యాయులను ఉపయోగించరాదని డిమాండ్ చేశారు. ఇటీవల విజయవాడలో జరిగిన ధర్నా కార్యక్రమంలో అన్ని సంఘాలు కలిసి ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫ్యాప్టో మండల నాయకులు పాల్గొన్నారు.



పెద్దపంజాణిలో

సోమల: పాఠశాలలలో విద్యాబోధన కాకుండా బోధనేతర పనులను ఉపాధ్యాయులకు అప్పగించడం ద్వారా పని ఒత్తిడి పెరగడమే కాకుండా నాణ్యమైన విద్యను విద్యార్థులకు అందించలేకపోతున్నామని ఇకపై బోధనేతర పనులు బహిష్కరిస్తున్నట్లు సోమల మండల ఫ్యాప్టో నాయకులు ఎంఈఓ శివరత్నమ్మకు వినతిపత్రం ద్వారా అందించారు. ఈ కార్యక్రమంలో వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు వెంకటరమణ, జి సి కె ప్రసాద్, భాస్కర్, రమణ పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వినియోగంపై తనిఖీలు

ప్రజాశక్తి- కుప్పం: కుప్పం మున్సిపాలిటీ పరిధిలో కంపోస్టబుల్ ఎకోలాస్టిక్ సంచుల వినియోగంపై ఎకోలాస్టిక్ ఇండస్ట్రీస్ అధినేత రజనీకాంత్ ఆధ్వర్యంలో గురువారం దుకాణాల్లో తనిఖీలు చేపట్టారు. కుప్పంలో కంపోస్టబుల్ ఎకోలాస్టిక్ సంచుల పేరుతో ప్లాస్టిక్ కన్నా ప్రమాదకరమైన సంచులను వినియోగిస్తున్నారని ఎనిమిది చోట్ల పరిశీలించగా ఆరు చోట్ల ప్లాస్టిక్ కన్నా ప్రమాదకరమైన సంచులను గుర్తించినట్లు ఆయన తెలిపారు. కంపోస్టబుల్ ఎకోలాస్టిక్ సంచుల వినియోగంపై త్వరలోనే వ్యాపారులకు అవగాహన కల్పించేందుకు కార్యక్రమాలు చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు.

కుప్పంలో ఎకోలాస్టిక్ సంచుల పరిశ్రమ

కుప్పంలో కడ సహకారంతో త్వరలోనే కంపోస్టబుల్ ఎకోలాస్టిక్ తయారీ యూనిట్ను ఏర్పాటు చేయనున్నట్లు ఎకోలాస్టిక్ ఇండస్ట్రీస్ అధినేత రజనీకాంత్ తెలిపారు. ఈ పరిశ్రమ ఏర్పాటు ద్వారా మెప్మా ఆధ్వర్యంలో సుమారు 50 మందికి ఉపాధి అవకాశాలు కల్పించడం జరుగుతుందన్నారు పర్యావరణ అనుకూలమైన, కంపోస్టబుల్ (విచ్ఛిన్నమయ్యే) సంచులు. వీటిని కూరగాయల వ్యర్థాలు, తిండి గింజల నుంచి సేకరించిన పిండి పదార్థాలతో తయారుచేస్తారు. పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టిక్ కవర్లకు ప్రత్యామ్నాయంగా వీటిని తయారుచేస్తారు. ఈ సంచులకు భూమిలో సులభంగా విచ్ఛిన్నమయ్యే లక్షణం కలిగి ఉంటాయి. దీంతో కుప్పం ప్రాంతంతో పాటు చిత్తూరు జిల్లా అదేవిధంగా తమిళనాడు కర్ణాటక ప్రాంతాలకు సైతం సరఫరా చేసేందుకు అవకాశం ఉంటే మరింత మందికి కుప్పంలో ఉపాధి కల్పించనున్నారు.

మామిడి రైతుల ఆక్రందన సభకు అనుమతి నిరాకరణ అప్రజాస్వామికం


ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: మామిడి రైతులు తమగోడును శాంతి యుతంగా, ప్రజాతంత్ర పద్దతుల్లో తెలియపరచు కొనేందుకు సైతం అవకాశం ఇవ్వక పోవడం అత్యంత దుర్మార్గమని, హేమమైన చర్య అని ఉమ్మడి చిత్తూరు జిల్లా మామిడి రైతు సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డా. టి. జనార్ధన్, సి. మునీశ్వర్ రెడ్డి లు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మామిడి రైతులు తమ కష్టాలను చర్చించుకునేందుకు బంగారుపాలెం మార్కెట్ యార్డులో ఆక్రందన సభకు అనుమతి ఇవ్వకపోవడం భావ ప్రకటన స్వేచ్ఛను హరించడంతోపాటు ప్రజాస్వామ్య విలువలను కాలరాయడమేనని పేర్కొన్నారు.బంగారు పాళ్యం సభ (హాల్ మీటింగ్)అనుమతి నిరాకరిస్తే తాము ప్రత్యామ్నాయంగా రోడ్ పైనే నిర్వహించు కోవాల్సివస్తుందని తెలిపారు. ఇప్పటి కైనా ప్రభుత్వం రైతు పక్షపాతిగా వ్యవహరించి 12 చొప్పున రైతుల ఖాతాల్లో వేస్తే ప్రభుత్వానికి సహకరిస్తామని పేర్కొన్నారు. లేకుంటే అక్టోబర్ 15 న ఆక్రందన సభ సందర్భంగా జరిగే పరిణామాలకు ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి వస్తుందని వారు హెచ్చరించారు.



మహతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో గర్భిణులకు ఉచిత భోజనం అందిస్తున్న దృశ్యం

గర్భిణులకు ఉచిత భోజనం

ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి: బైరెడ్డిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రధానమంత్రి సురక్షిత మాతృ అభియాన్ కార్యక్రమం గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహతి ఫౌండేషన్ మానవతా దృక్పథంతో ముందుకు వచ్చి, మండలంలోని వివిధ గ్రామాల నుండి వచ్చిన గర్భిణులకు, వైద్య సిబ్బందికి ఉచిత భోజన సౌకర్యం అందించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ సావిత్రి గర్భిణీలతో మాట్లాడుతూ ప్రతి నెలా నిర్బంధంగా రక్తపరీక్షలు, వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. రక్తహీనత నివారణ కోసం పుష్కలమైన పోషకాహారం తీసుకోవడం, వ్యక్తిగత శుభ్రత పాటించడం ఎంతో ముఖ్యమని ఆమె వివరించారు. సావిత్రి, సీజనల్ వ్యాధుల నివారణ చర్యలు, సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ వంటి ఆరోగ్య భద్రత పథకాలపై కూడా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ వోలు, సూపరువైజర్లు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, మహతి ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.



హరికథ, వీధి నాటక ప్రదర్శన

ప్రజాశక్తి-తవణంపల్లి: తవణంపల్లి మండల కేంద్రం 120వ మహాభారత యజ్ఞ మహోత్సవం సందర్భంగా హరికథను గురువారం ప్రదర్శించారు. గాన కోకిల నాట్య మయూరి ఏ శారద , వాయిద్యం ఏ సుదర్శనం, హార్మోనిస్ట్ ఎం కె సోమశేఖర్ తబలా వాయిద్యం, ఆలయ ధర్మకర్త గుడిసె మునస్వామి శెట్టి గ్రామస్తుల ఆధ్వర్యంలో మహాభారత హరికథ కాలక్షేపం నిర్వహించారు. రాత్రి కౌరవ పాండవుల యుద్ధం శ్రీ వరసిద్ధి వినాయక నాటక మండలి ఆధ్వర్యంలో మేనేజర్ టి. రంగం ఆనందం ఏ మని, డి అరవింద్, సాయి, వినీత్ ద్వారా నాటక ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త గుడిసె మునస్వామి శెట్టి, సదాశివశెట్టి, మోహన్, వేలు శెట్టి , మాజీ ధర్మకర్త గణేష్ శెట్టి, పెద్దలు, యువజన సంఘ సభ్యులు, తవణంపల్లి పరిసరాల గ్రామస్తులు పాల్గొన్నారు

బార్ కౌన్సిల్ ఛైర్మన్ దృష్టికి న్యాయవాదుల సమస్యలు



ప్రజాశక్తి-పలమనేరు: రాష్ట్ర వ్యాప్తంగా న్యాయవాదులు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై పలమనేరు న్యాయవాదులు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బార్ కౌన్సిల్ ఛైర్మన్ ఎం ద్వారకనాథరెడ్డికి విన్నవించారు. గురువారం ఆయన పలమనేరు బార్ అసోసియేషన్‌ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన హయాంలో న్యాయవాదులకు సంక్షేమ కార్యక్రమాల విషయంలో దృష్టి సారించి డెత్ బెనిఫిట్స్, మెడికల్ బెనిఫిట్స్ ఈనెల మొదటి తేదీ నుంచి న్యాయవాదులకు అదనంగా పెంచిన బెనిఫిట్స్ కృషి చేశానని పేర్కొన్నారు. ఈ సందర్భంగా న్యాయవాదులు తమకు ఇంటి స్థలాలు కేటాయించాలని, గౌరవ హైకోర్టు సమీపంలో ఒక గెస్ట్ హౌస్ ను నిర్మించి రాష్ట్రవ్యాప్తంగా హైకోర్టుకు వెళ్లే న్యాయవాదులకు తక్కువ అద్దెలో రూములు కేటాయించేందుకు కృషి చేయాలని, 30 సంవత్సరాల ప్రాక్టీస్ పూర్తయిన న్యాయవాదులకు సగం వెల్ఫేర్ ఫండ్ అందేలా చర్యలు తీసుకోవాలని, మిగిలిన సగం వెల్ఫేర్ ఫండ్‌ను సదరు న్యాయవాది మృతి అనంతరం కుటుంబ సభ్యులకు అందించాలని కోరారు. న్యాయవాదులకు వయసుతో నిమిత్తం లేకుండా పెన్షన్ అందించాలని కోరారు. బార్ కౌన్సిల్ జమా లెక్కలను ప్రతి బార్ అసోసియేషన్‌కు సమాచారం అందించాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా కోర్టుల్లో రెగ్యులర్ గా ప్రాక్టీస్ చేయని, కోర్టుకు రెగ్యులర్‌గా హాజరుకాని న్యాయవాదులను వెల్ఫేర్ ఫండ్ జాబితా నుండి తొలగించాలని డిమాండ్ చేశారు. బార్ కౌన్సిల్ ఛైర్మన్ ను స్థానిక న్యాయవాదులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎల్ భాస్కర్, ఉపాధ్యక్షులు చంద్రశేఖర్, షరీఫ్, జాయింట్ సెక్రెటరీ ఫామీద్ బాషా, స్పోర్ట్స్ కార్యదర్శి రంజిత్ షా, సీనియర్ న్యాయవాదులు పి పరమశివప్ప, కే లక్ష్మీపతి, వికె హారూన్, బి. మోహన్ రెడ్డి, రెడ్డెప్ప శెట్టి, రాజారెడ్డి, జి కృష్ణమూర్తి, లక్ష్మణ్ రెడ్డి, నారాయణరెడ్డి, అరిఫుల్లా ఖాన్, ఇర్షాద్, రంజిత్, రాజీవ్ గాంధీ, రాజులతో బాటు పలువురు మహిళా న్యాయ వాదులు పాల్గొన్నారు.

పిల్లలపై శ్రద్ధ వహించాలి

ప్రజాశక్తి-పెద్దపంజాణి: తల్లిదండ్రులు వారి పిల్లల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని, పాఠశాలలో ఉపాధ్యాయులు విద్యార్థులకు వర్షాల పట్ల జాగ్రత్తలు తెలపాలని ఎంపీడీవో బాలాజీ ఉపాధ్యాయులకు మండల విద్యాశాఖ అధికారికి సూచించారు. గురువారం ఎంపీడీఓ కార్యాలయంలో మండల విద్యాశాఖ అధికారితో సమావేశ అనంతరం ఆయనను మాట్లాడుతూ భారీగా వర్షాలు కురుస్తుండటంతో వాగులు వంకలు చెరువులు, కుంటల వద్దకి వెళ్లి ప్రమాదాల బారిన పడకుండా విద్యార్థులకు తగిన సూచనలు ఇవ్వాలని,పాఠశాల పరిసరాలలో నాసిరకాల తిరుబండారాల అమ్మకాలను నివారించాలని, పాఠశాలల వద్ద నిర్మాణాలు ఏవైనా జరిగితే అలాంటి చోట ఎలాంటి ప్రమాదాలు జరగకుండా రెడ్ రిబ్బన్ ఏర్పాటు చేయాలని,విద్యార్థుల సంరక్షణ పట్ల అప్రమత్తంగా ఉండాలని పాఠశాలల హెడ్మాస్టర్ తో నిర్వహించిన ఆన్లైన్ టెలి కాన్ఫరెన్స్‌లో ఎంపీడీవో బాలాజీ సూచించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి గోపాలు రెడ్డి, జిల్లా ప్రజా పరిషత్ ప్రాథమికోన్నత ప్రాథమిక పాఠశాలల ప్రధాన ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే 'పల్లెనిద్ర'

ప్రజాశక్తి - ఎస్ఆర్ పురం : గ్రామంలో ప్రజలతో మమేకమై వారి ద్వారానే ఆ గ్రామంలో సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారం కోసమే పల్లె నిద్ర 'మన గ్రామానికి.. మన థామస్' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు గంగాధర్ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ డాక్టర్ వి.యం థామస్ అన్నారు. ఎస్ఆర్ పురం మండలం ఎగువ కమ్మకండిగ గ్రామంలో పల్లెనిద్ర చేశారు. ఈ సందర్భంగా మహిళలతో, గ్రామస్తులతో కలిసి గ్రామ సమస్యల గురించి మాట్లాడారు. ప్రతి ఒక్కరితో మాట్లాడి వారి సమస్యలను ఓపికగా వింటూ వ్యక్తిగత కార్యదర్శి చంద్ర ద్వారా నమోదు చేసి ఇచ్చి దీనిని పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. రీ సర్వేలో జరిగిన తప్పులను సరిదిద్దాలని, పుల్లూరు వంక ఎగువ కమ్మకండిగ వద్ద బ్రిడ్జి నిర్మాణం ఏర్పాటుచేసి వర్షాకాలంలో రహదారి కోతకు గురై గ్రామాలకు రాకపోకలు ఆగిపోతాయని ప్రజలు ఇబ్బంది పడుతున్నారు, బ్రిడ్జి నిర్మించాలని ఎమ్మెల్యేని కోరారు. వడ్డీ కండిగ కు వెళ్లే దారిలో ఉన్న వంకకి బ్రిడ్జీ నిర్మించాలని కోరారు. దీంతోపాటు గ్రామంలో సీసీ రోడ్లు, మురుగునీటి కాలువలు వంటి సౌకర్యాలు కల్పించాలని ఎమ్మెల్యేని కోరారు. గ్రామంలో టిడిపిలో అభివృద్ధి జరగలేదన్న అపవాదు ఉందని గ్రామ సమస్యలు పరిష్కరించి ఈ అపవాదును తొలగించాలని గ్రామస్తులు కోరారు. ఈ దారిలో లోకేష్ పాదయాత్ర జరిగిందని అప్పుడు గుర్తించిన సమస్య వెంటనే పరిష్కరించాలని అన్నారు. సమస్యలన్నీ విన్న ఎమ్మెల్యే డాక్టర్ వి ఎం థామస్ ఎన్నికల్లో తనతో పాటు తిరిగిన ఈ గ్రామస్తులను మరువలేమని ఈ గ్రామాన్ని అభివృద్ధి చేస్తానని మొట్టమొదట 'మన ఊరు... మన థామస్' అన్న కార్యక్రమం ఈ గ్రామంలో ప్రారంభించడం, గ్రామస్తులు సమస్యలు దృష్టికి తీసుకు రావడం తన అదృష్టం అన్నారు. అన్ని సమస్యలు పరిష్కరిస్తామని గ్రామస్తులు హామీ ఇచ్చారు. మండలంలో జరుగుతున్న ఉత్తరం గ్రావెల్ అనుమతులు ఇచ్చింది మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి అని ప్రస్తుతం నారాయణస్వామి అది మర్చిపోయారని ఆరోపించారు. ఈ వయసులో ఇలాంటి ఆరోపణలు చేయడం తగదన్నారు. అనంతరం ఆ గ్రామంలో నిద్రించారు.ఈ కార్యక్రమంలో శ్రీ రంగరాజపురం మండల పార్టీ అధ్యక్షుడు గంధమనేని జయశంకర్ నాయుడు, తహశీల్దార్ లోకనాథపిళ్ళై, జిల్లా నాయకుడు శ్రీధర్ యాదవ్, ఎస్సీ సెల్ నాయకుడు చొక్కా మడుగుకుమార్, సూరి రెడ్డి, కేయం రవి బాలాజీ నాయుడు బిజెపి నియోజకవర్గ అధ్యక్షులు రాజేంద్ర, జనసేన ఇన్‌చార్జి పొన్నా యుగంధర్, స్థానిక నాయకుల మహిళలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే థామస్

లాడ్జిల తనిఖీ

ప్రజాశక్తి- పలమనేరు:

పలమనేరు టౌన్ లోని లాడ్జిలను పోలీసు అధికారి మురళీమోహన్, పలమనేరు అర్బన్ పిఎస్, సబ్ ఇన్‌స్పెక్టర్ లోకేష్, సిబ్బంది గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. అనుమానం ఉన్న వ్యక్తుల పైన నిఘా ఉంచి లాడ్జి ఓనరు, అక్కడ పనిచేస్తున్న సిబ్బందికి తగు సూచనలు ఇచ్చారు. లాడ్జి కి వచ్చే కస్టమర్ వారి వద్ద నుంచి తప్పనిసరిగా ఆధార్ కార్డు తీసుకోవాలని, సీసీ కెమెరాలు మెయింటైన్ చేయాలని, కనీసం ఒక నెల రోజులు సీసీ కెమెరా ఫుటేజ్ స్టోరేజ్ ఉంచు కోవాలని, ఎవరైనా అనుమా నాస్పద వ్యక్తులు వచ్చి లాడ్జిలో ఉంటే పోలీస్ వారికి తెలపాలని, ఎలాంటి అసాంఘిక కార్యక్రమాలకు తావు లేకుండా చూడాలన్నారు.





జీఎస్‌టీపై అవగాహన కల్పించాలి

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్ :

వైద్య ఆరోగ్య శాఖ ద్వారా సూపర్ జీఎస్‌టీ–సూపర్ సేవింగ్స్ పై చిత్తూరు నగర పరిధిలోని బాబు నర్సింగ్ హోమ్ ప్రైవేట్ ఆసుపత్రిలో గురువారం అవగాహన కల్పించారు. ముఖ్యంగా వైద్య పరికరాలు మందులు పై జీఎస్టీ తగ్గింపు వివరాలను తెలియపరుస్తూ ప్రాణాధార మందులపై జీరో టాక్స్, సాధారణ మందులపై 5శాతం, గ్లూకోమీటర్ ,టెస్ట్ స్ట్రాప్స్ పై శాతం, థర్మామీటర్ ,మెడికల్ ఆక్సిజెన్, రోగ నిర్ధారణ కిట్లు, కళ్ళజోళ్ళు ,లెన్సులు, వైద్య పరికరాలు, ఆయుర్వేద హోమియోపతి మందులపై 5 శాతం మాత్రమే ఉందని, ఆరోగ్య బీమా పై పూర్తిగా జిఎస్టి తీసి వేశారని తెలిపారు. ప్రజలు ఈ అవకాశం అవినియోగించుకుని ఆర్థిక భారం నుంచి వెలుసుబాటు పొందాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వెంకటప్రసాద్, డాక్టర్ సుదర్శన్, డాక్టర్ అనిల్, డాక్టర్ రమేష్ రెడ్డి, డాక్టర్ ప్రవీణ , పాల్గొన్నారు.

కంటి పరీక్షలు చేయించుకోవాలి

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్ :

ప్రతి ఒక్కరూ ఆరు నెలలకోసారి కంటి వైద్య పరీక్షలు చేయించుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టరు డిటి సుధారాణి పేర్కొన్నారు. చిత్తూరు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ డిటి సుధారాణి ఆధ్వర్యంలో చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రి ప్రపంచ దృష్టి లోపం దినోత్సవం నిర్వహించారు. ప్రతి సంవత్సరం అక్టోబర్ 9వ తేదీ దృష్టిలోపంపై ప్రజలకు అవగాహన కల్పిస్తారన్నారు. ఈ సందర్భంగా డిఎంహెచ్వో మాట్లాడుతూ ప్రజలు దృష్టిలోపంపై తప్పనిసరి జాగ్రత్త వహించాలని, విటమిన్ ఏ కలిగిన ఆహార పదార్థాలను క్యారెట్, బొప్పాయి, ఆకుకూరలు, గ్రుడ్లు ప్రతిరోజు తీసుకుంటే దృష్టిలోపాన్ని నివారించ వచ్చున్నారు. ప్రతి ఆరు నెలలకు కంటి పరీక్షలు చేసుకున్నచో ఎలాంటి దృష్టి సమస్య ఉన్న వెంటనే చికిత్సతో నివృత్తి చేసుకుని ఆరోగ్యంగా ఉండవచ్చు అన్నారు. ఈ కార్యక్రమంలో సమాజంలో ప్రజలకు విఫలంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో డిబిసియస్ డాక్టర్ అర్పిత, ఆప్తమిక్ అధికారులు పాల్గొన్నారు.

యంబియు యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - క్యాంపస్

:మోహన్ బాబు యూనివర్సిటీ గుర్తింపు రద్దు చేసి, మంచు మోహన్ బాబు, మంచు విష్ణుల పై క్రిమినల్ కేసులు నమోదు చేసి అరెస్ట్ చేయాలని డిమాండ్ చేస్తూ తిరుపతిలోని బాలాజీ కాలనీలో ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లికార్జున, జిల్లా అధ్యక్షులు శివ బాలాజీ మాట్లాడుతూ యంబీయులో ఫీజుల అక్రమాలు, నిధుల దుర్వినియోగంపై తీవ్రంగా విమర్శించారు. ఉన్నత విద్యా మండలి, ఆంధ్రప్రదేశ్ ఫీజు రెగ్యులేషన్ కమిటీ విచారణ చేసి రూ.15 లక్షల జరిమానా విధించి, విద్యార్థులకు రూ. 23 కోట్లు తిరిగి చెల్లించాలనే ఆదేశించడం సరైన చర్య అన్నారు. కానీ వారిపై క్రిమినల్ కేసులు పెట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ యూఐ జిల్లా అధ్యక్షుడు శివ బాలాజీ, జిల్లా ప్రధాన కార్యదర్శి మన్సూర్, జిల్లా కార్యదర్శి కుమార్ తదితరులు పాల్గొన్నారు.